క్లుప్తంగా

శభాష్ వలంటీర్

● ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత


ఆదినారాయణకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వెంకటేష్

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె మండలం పెద్దమాదిగ పల్లెకు చెందిన కిడ్నీ డయాలసిస్ బాధితుడు ఎస్.ఆదినారాయణ చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ గ్రామానికి చెందిన వలంటీర్ కొమ్ము వెంకటేష్ దాదాపు 120 కిలోమీటర్ల దూరంలోని చిత్తూరుకు తన సొంత ఖర్చుతో వెళ్లి ఆదినారాయణకు పెన్షన్ మొత్తం రూ.10,000 అందజేశాడు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు ఆదినారాయణ వలంటీర్ కొమ్మువెంకటేష్‌కు, ఎక్కడ ఉన్నా ఠంచన్‌గా పింఛన్ అందించే వ్యవస్థను తీసుకువచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వలంటీర్‌ను ఎంపీడీఓ లీలామాధవి సచివాలయ సిబ్బంది అభినందించారు.

ఆర్టీసీని ఆదరించాలి


లక్కీడిప్ తీస్తున్న డీఎం నిరంజన్

మదనపల్లె సిటీ : ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించాలని ఆర్టీసీ 2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ అన్నారు. గురువారం స్థానిక డిపో కార్యాలయంలో మదనపల్లె–గాలివీడు మార్గంలో లక్కీ డిప్ తీశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెలా గిఫ్ట్‌స్కీమ్ కింద లక్కీడిప్‌లు తీసి విలువైన బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ గీత, సిబ్బంది పాల్గొన్నారు.

సారా ఊట ధ్వంసం

ములకలచెరువు : ములకలచెరువు సర్కిల్ పరిధిలోని తంబళ్లపల్లె మండలం ఆర్‌ఎన్ తండా పరిసర ప్రాంతంలో గురువారం సారా ఊట ధ్వంసం చేశారు. ఎస్ఈబీ సీఐ మల్లిక కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్‌ఎన్ తండా సమీపంలో నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఈబీ సిబ్బంది దాడులు నిర్వహించారు. సుమారుగా 400 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు.

మహిళ అరెస్ట్

నిమ్మనపల్లె : వెంగంవారిపల్లె పంచాయతీ బాలినాయునిపల్లె సమీపంలో ఎం.అక్కులు(44) సారా విక్రయిస్తుండగా పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి 8 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఫాతిమా తెలిపారు.

అర్థమయ్యేలా బోధించాలి

తంబళ్లపల్లె: విద్యార్థుల అభ్యసన స్థాయిని గుర్తించి, వారికి అర్థమయ్యేలా సరళంగా బోధన చేయాలని ఎంఈవో త్యాగరాజు టీచర్లను ఆదేశించారు. గురువారం గోపిదిన్నె ఉన్నత పాఠశాల, ఉప్పలూరివాండ్లపల్లె ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్, టీచర్ ఆదినారాయణ, సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి


విజేతలతో మున్సిపల్ చైర్మన్, ఫోర్డు సిబ్బంది

మదనపల్లె సిటీ: విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఫోర్డు సంస్థ ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ మేళా నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సీడీపీఓ సుజాత, ఫోర్డు డైరెక్టర్ జల్లా లలితమ్మ, కౌన్సిలర్ ఫర్జానా, హెచ్‌ఎం పద్మావతి, ఫోర్డు సిబ్బంది నరసింహులు, శ్రీధర్, సుభాషిణి పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్‌గా చెన్నకేశవులు


చెన్నకేశవులకు అభినందనలు తెలుపుతున్న అధ్యాపకులు

కేవీపల్లె : గ్యారంపల్లె ఏపీ రెసిడెన్సియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా మాధవరం చెన్నకేశవులు బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ప్రిన్సిపాల్‌గా పని చేసిన శివయ్య పదవీ విరమణ పొందారు. దీంతో కళాశాలలో బోటనీ అధ్యాపకులుగా పని చేస్తున్న చెన్నకేశవులు గురువారం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సూర్యనారాయణరెడ్డి, రామకృష్ణ, భూపతి, రమణయ్య, ప్రభావతి, అన్నపూర్ణ, సౌజన్య, వెంకటరమణ, హరి, వెంకటేశ్వర్లు, రమేష్, కొండయ్య, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా జగనన్న పాలన

● గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా


ప్రభుత్వ పథకాలపై మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా, ప్రజల జీవనప్రమాణాల పెంపే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. బుధవారం పట్టణంలోని 32వ వార్డులో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించారు. పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. బుక్‌లెట్లలో ముద్రించిన పథకాలు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఒడి, చేయూత పథకాలతో తమ కుటుంబాలకు మేలు జరిగిందని లబ్ధిదారులు తెలిపారు. ఇంటి వద్దకే రేషన్ అందుతోందా..? వలంటీర్లు వచ్చి పింఛన్ అందిస్తున్నారా అని ఎమ్మెల్యే ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కోసం నిత్యం ఆలోచిస్తూ.. వారి సంక్షేమానికి అహర్నిశలు కష్టపడుతున్న ముఖ్యమంత్రి జగనన్న కావాలా..? కేవలం ముఖ్యమంత్రి పదవి మీద మోజుతో ప్రజలను మోసగించేందుకు వస్తున్న చంద్రబాబు కావాలా? ఆలోచించుకోవాలన్నారు. జగనన్న అందిస్తున్న పథకాలను చూసి ఓర్వలేని టీడీపీ నేతలు అసత్య ప్రచారాలతో పబ్బం గడుపుతున్నారని దుయ్యబట్టారు. పేదల కోసం రేయింబవళ్లు శ్రమిస్తున్న సీఎం జగనన్న మరో 30 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలందరూ కోరుకుంటున్నారన్నారు. గతంలో సీఎంగా ఉన్న సమయంలో చంద్రబాబు పేదలు, వారి సంక్షేమం గురించి ఆలోచించకుండా నేడు మొసలికన్నీరు కారుస్తూ తనకు ఇవే చివరి ఎన్నికలు అంటూ వంగి వంగి దండాలు పెడుతున్నారన్నారు. రాష్ట్రంలోని ప్రజలకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎలాంటి వారో... వారికి అధికారం ఇస్తే ఏం జరుగుతుందో అంతా తెలుసని.. ఎవరేమి చెప్పినా మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా చేసుకోవాలని నిర్ణయం తీసేసుకున్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మేస్త్రీ శ్రీనివాసులు, రామిశెట్టి శివయ్య, ఎం.వి.రమణ, ఎస్.కరీముల్లా, ఎస్వీ రమణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, కోఆప్షన్ శారదారెడ్డి, వైస్ ఎంపీపీ నందినితాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు బండిమనోహర్, కరమల హేమంత్‌రాజు, చందూరెడ్డి, సదాశివరెడ్డి, ఎల్‌ఐసీ సుధాకర్, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠనారాయణుడిగా శ్రీలక్ష్మీజనార్దనస్వామి


వైకుంఠనారాయణుడి అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీలక్ష్మీజనార్దనస్వామి

రామసముద్రం : మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీ జనార్దనస్వామి బ్రహ్మ రథోత్సవంలో భాగంగా గురువారం స్వామివారు వైకుంఠనారాయణుడి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధి భట్టర్, కులశేఖర్‌భట్టర్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామివారికి ఊంజలసేవ నిర్వహించారు. రాత్రి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చాందినీ బండ్లకు అనుమతి తప్పనిసరి

మదనపల్లె : మండల పరిధిలోని సీటీఎం గంగజాతరకు చాందినీ బండ్లు కట్టే నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకోవాలని తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. స్థానికంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 7, 8 తేదీల్లో సీటీఎంలో జరగనున్న నలవీర గంగాభవానీ జాతరకు పెద్ద ఎత్తున చాందినీ బండ్లు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. అనుమతి లేకుండా బండ్లు కడితే సీజ్ చేసి నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామన్నారు. మైకులు అమర్చుకునే నిర్వాహకులు ముందుగా డీఎస్పీ నుంచి పర్మిషన్ తీసుకోవాలన్నారు. జాతరలో గొడవలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. రికార్డు డ్యాన్సులు, అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. అనుమతులు పొందిన చాందినీ బండ్లకు కానిస్టేబుల్లను భద్రతగా నియమిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు చంద్రశేఖర్, సుధాకర్‌లు పాల్గొన్నారు.

నేడు అక్కదేవతల ఉత్సవాలు


మర్రిపాడులోని అక్కదేవతల విగ్రహాలు

గుర్రంకొండ : మండలంలోని మర్రిపాడు గ్రామంలో వెలసిన శ్రీ అక్కదేవతల ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఏటా ఇక్కడ అక్కదేవతల ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శుక్రవారం గ్రామంలోని అలివేలమ్మ ఇంటి నుంచి అక్కదేవతల గుర్రాలు, నాగదేవతల విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా గ్రామానికి సమీపంలో ఉన్న శ్రీ అక్కదేవతల ఆలయం వద్దకు తీసుకెళతారు. ఆలయంలో ఉన్న శివపార్వతుల విగ్రహాలకు, ఆంజనేయస్వామికి, అయ్యప్పస్వామి, నాగదేవతలు, అక్కదేవతలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. కోలాటాలు, చెక్కభజనలు పెద్ద ఎత్తున నిర్వహించి, భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని నిర్వాహకులు జి.వెంకటరమణ తెలిపారు.

పాల సేకరణ వేగవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మురళి

ములకలచెరువు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అమూల్ డెయిరీ ద్వారా పాల సేకరణ వేగవంతం చేయాలని మదనపల్లి ఆర్డీఓ మురళి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, సంఘమిత్రలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఎంసీయూ కేంద్రాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో పాడిరైతుల నుంచి పాల సేకరణ చేసి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పాడిరైతు అమూల్ డెయిరీకే పాలు అందించేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. పాల ధర, ఫీడు పంపిణీ, నెల నెలా బిల్లులు పాడిరైతులకు అందే విధానంపై అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, గ్రామస్థాయి అధికారులు ఉన్నారు.

5న ధ్వజస్తంభ ప్రతిష్ట

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం చిప్పిలి గ్రామంలో వెలసిన సత్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 5న (ఆదివారం) ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని ఆలయ వ్యవస్థాపకులు రమణరావు, సుబ్బశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

11న నవోదయ ప్రవేశ పరీక్ష

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం చిత్తూరు రోడ్డులోని నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ప్రవేశానికి ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని విద్యాలయ ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న సీట్లకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.45 వరకు జరుగుతుందన్నారు. ఎన్‌వీఎస్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 8919552075ను సంప్రదించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: మండలంలోని మాధవరంపల్లి, చిన్నగంగువారిపల్లిలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుల కుటుంబాలను పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గురువారం పరామర్శించారు. మాధవరంపల్లి ఉపసర్పంచ్ చీళ్ల రామ్మూర్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామ్మూర్తి పిల్లల విద్యాభ్యాసానికి సహకారం అందిస్తామని, అలాగే ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే చిన్నగంగువారిపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఓబుల్‌రెడ్డి మాతృమూర్తి మృతి చెందడంతో వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీళ్లభాస్కర్, ఉపసర్పంచ్ కేశవరెడ్డి, సర్పంచ్ మునిభాస్కర్, నాయకులు అబ్దుల్ కలీమ్, మల్లికార్జునరెడ్డి, శివకుమార్‌రెడ్డి, సురేష్ కుమార్‌రెడ్డి, ఆనంద, చికెన్ మస్తాన్, సైపుల్లా, రవి, రమేష్, శంకర, సత్య, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశులు తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విచ్చేస్తారని ఆయన పేర్కొన్నారు. కావున అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీవో లక్ష్మీపతి

వాల్మీకిపురం: సచివాలయాలకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మదనపల్లి డీఎల్‌డీవో లక్ష్మీపతి అన్నారు. గురువారం స్థానిక సచివాలయం 1, 2లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలిగించి, సకాలంలో వారికి సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. సచివాలయాల్లో లభించే సేవలను నోటీసు బోర్డులో ఉంచాలని, స్పందనలో వచ్చే అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందే సేవల్లో ఎవ్వరూ అశ్రద్ధ వహించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో ఉదయ్ కుమార్, సచివాలయ సిబ్బంది క్రాంతి, విజయకుమారి, స్వర్ణ, వేణి, అమృత, వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్‌గా ఎస్.ఎన్.బాషా


అవార్డు అందుకుంటున్న డ్రైవర్ బాషా

మదనపల్లె సిటీ: మదనపల్లె ఆర్టీసీ టు డిపోలో పని చేసే డ్రైవర్ ఎస్.ఎన్.బాషా రీజనల్ స్థాయిలో ఉత్తమ డ్రైవర్‌గా ఎంపిక అయ్యారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా రాయచోటిలో గురువారం జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణా అధికారి జగదీష్ అవార్డు, ప్రశంసా పత్రం అందజేశారు. బాషా 30 ఏళ్లు సర్వీసు పూర్తి చేసుకుని ఎటువంటి ప్రమాదాలు చేయలేదు. కార్యక్రమంలో డీఎం నిరంజన్ పాల్గొన్నారు.

పీలేరు రూరల్ : పీలేరు డిపోలో పని చేస్తూ జిల్లాలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ఉత్తమ డ్రైవర్లను సన్మానించారు. వి.రాజగోపాల్, ఎ.ఎ.సాహెబ్ జిల్లాలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వారికి రాయచోటిలో డీఎస్పీ శ్రీధర్, జిల్లా ప్రజా రవాణాధికారి జగదీష్ బహుమతులు అందించారు. అలాగే ఎస్ఎం.వలి, జి.ఎర్రయ్య, వి.ఉమాపతిలకు కూడా బహుమతులు అందజేశారు.

ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి


ఈ క్రాప్ నమోదును తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ ఏవో షణ్ముఖం

గుర్రంకొండ : రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ ఏవో షణ్ముఖం అన్నారు. గురువారం మండలంలోని రామాపురం, సంగసముద్రం గ్రామాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది నిర్వహిస్తున్న ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. వ్యవసాయ సిబ్బంది నమోదు చేసిన, వాస్తవంగా పొలం ఉన్న, సాగు చేసిన పంట విస్తీర్ణం వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ ఈనెల 15 తేదీలోగా ఈక్రాప్ నమోదును సంబంధిత ఆర్బీకేల వద్ద చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే ఈ క్రాప్ నమోదు తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రత్నమ్మ, వీహెచ్‌ఏలు సమీనా, వెంకటరమణ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎంవో, ఎమ్‌పీహెచ్‌వో

గుర్రంకొండ: కుష్టు వ్యాధిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా డీపీఎంవో వేణుగోపాల్, ఎంపీహెచ్‌వో రమ్యానాయక్ అన్నారు. గురువారం మండలంలోని తరిగొండ జెడ్పీహైస్కూల్లో విద్యార్థులకు కుష్టువ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పర్శలేని మచ్చలు శరీరంపై ఉంటే వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ నరసింహప్రసాద్, పీడీ నాగరాజు, ఏఎన్ఎమ్ సురేఖ, ఆశా చిన్నప్ప, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

రామసముద్రం : కుష్టు వ్యాధిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రామసముద్రం, చెంబకూరు మెడికల్ ఆఫీసర్లు లీలా, శ్వేతారెడ్డి తెలిపారు. గురువారం కుదురుచీమనపల్లె, ఎలకపల్లె గ్రామాల్లో కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. స్పర్శలేని మచ్చలు, ముఖం, చెవులు, వీపుపై నొప్పిలేని బుడిపెలు, పాదాలు, చేతులపై బొబ్బలు రావడం కాళ్లు, చేతులు తిమ్మిర్లు, కనురెప్పలు, కనుబొమ్మలు రాలిపోవటం వంటి లక్షణాలు కుష్టు వ్యాధికి సంబంధించినవన్నారు. వీటి నివారణ కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో ఎండిటి మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతోందన్నారు.

రేపు వాహనాల వేలం

పెద్దతిప్పసముద్రం : స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఈ నెల 4న ద్విచక్ర వాహనాల వేలం పాటలు నిర్వహిస్తామని ఎస్ఐ మధురామచంద్రుడు గురువారం పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న వాహనాల్లో ఏడు వాహనాలను వేలం వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

డీకేటీ భూమిలో అక్రమ నిర్మాణాలు

–అడ్డుకుని తొలగించిన రెవెన్యూ సిబ్బంది

బి.కొత్తకోట : నగర పంచాయతీ పరిధిలోని పీటీఎం రోడ్డు పక్కన (ఆలేటివారిపల్లె దారి వద్ద) డీకెటీ భూమిలో ఓ వ్యక్తి అక్రమంగా నిర్మాణాలు చేస్తుండటం వివాదానికి దారి తీసింది. విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది అక్రమ నిర్మాణాలను తొలగించారు. రెవెన్యూ అధికారులు తెలిపి మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేటివారిపల్లె దారిలో ఇద్దరు వ్యక్తులకు డీకేటీ భూమిని కేటాయించారు. రోడ్డు పక్కన విలువైన స్థలంలో నిర్మాణం చేస్తున్నట్లు గుర్తించి ఆర్ఐ బాలాజీ, వీఆర్ఓలు అశోక్, ఖాదర్‌బాషా వాటిని నిలిపివేయించి, రాళ్లను తొలగించారు. దీనిపై ఆర్ఐ మాట్లాడుతూ నిర్మాణాలు జరుగుతున్న భూమి నిషేధిత జాబితాలో ఉందని, ఈ వ్యవహారంపై కలెక్టర్‌కు నివేదిస్తున్నట్లు చెప్పారు.

నేలమల్లేశ్వరస్వామి ఆలయ ఈఓగా మంజుల


మంజుల (ఫైల్)

నిమ్మనపల్లె : మండలంలోని తవళంలో వెలసిన శ్రీ నేలమల్లేశ్వరస్వామి ఆలయ నూతన ఈఓగా మంజుల గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఈఓ మునిరాజ మొగిలి దేవస్థానానికి బదిలీ కాగా, రెడ్డెమ్మకొండ ఆలయ ఈఓగా పని చేస్తున్న మంజులను ఇక్కడికి బదిలీ చేశారు. మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి రమణారెడ్డి, ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణతో కలిసి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మదనపల్లె నియోజకవర్గంలో ప్రముఖ శైవాలయం శ్రీనేలమల్లేశ్వరస్వామి సేవకు తనకు అవకాశం దక్కడం భగవంతుడి అనుగ్రహంగా భావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ మాన్యం, ఆస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో భక్తులకు అవసరమైన మౌలికవసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గంగాధర, శంకర, రవి, దేవదాయశాఖ సిబ్బంది మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రూట్ షాపు ప్రారంభించిన కామ్నాజెత్మలానీ


మదనపల్లెలో సినీ హీరోయిన్ కామ్నా జెత్మలానీ, ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : రణం, బెండు అప్పారావు సినిమాల హీరోయిన్ కామ్నా జెత్మలానీ బుధవారం మదనపల్లెకు వచ్చారు. గొల్లపల్లె రింగ్‌రోడ్డు ఎస్‌బీఐ కాలనీ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రాయల్ ఇన్ ఫీల్డ్ ఫ్రూట్స్ అండ్ విజిటెబుల్స్ మొదటి బ్రాంచ్ ప్రారంభోత్సవానికి ఆమె విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. మదనపల్లెకు మొదటిసారిగా వచ్చానని, ఇక్కడి వాతావరణం ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు. కార్యక్రమంలో ఫ్రాంచైజీ ఓనర్స్ యశ్వంత్, నరసింహారావు, గజేంద్ర, భానుప్రకాష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, కౌన్సిలర్లు డిష్ రామకృష్ణారెడ్డి, ప్రసాద్‌బాబు, భాను, మేస్త్రీ శ్రీనివాసులు, రామిశెట్టిశివయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు సదాశివరెడ్డి, రహీం, ఎల్ఐసీ సుధాకర్, వి.నారదరెడ్డి పాల్గొన్నారు.

చెత్త సేకరణ కేంద్రాలను వినియోగించుకోవాలి

కలకడ : మండలంలోని చెత్త సేకరణ కేంద్రాలను పంచాయతీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నారాయణ ఆదేశించారు. గురువారం మండలంలోని కలకడ పంచాయతీలోని చెత్తసేకరణ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి చెత్త నిల్వ, ఎరువుల తయారీకి తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. చెత్త సేకరణ, నిల్వ మాత్రమే కాకుండా సేంద్రీయ ఎరువులు తయారు చేయడానికి వానపాములు వదిలి ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్యారీజాన్, కార్యదర్శి నందిని, వైఎస్సార్‌సీపీ నాయకులు షౌకత్ అలీఖాన్, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు


విద్యార్థులకు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు వేస్తున్న డాక్టర్ శేషగిరిబాబు

పీలేరు : రక్తహీనత నివారణే లక్ష్యంగా విఫ్స్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శేషగిరి బాబు అన్నారు. గురువారం స్థానిక జీవీనగర్‌లోని ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో విఫ్స్ ప్రోగ్రాంను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనత నివారణకు ప్రతి గురువారం అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల్లో మధ్యాహ్నం భోజనం అనంతరం ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు మింగిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఆకుకూరలు, పండ్లు, ఖర్జూరా, బెల్లంతో చేసిన వంటలు నిత్యం ఆహారంగా ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ శివ శంకర్

వాల్మీకిపురం: ఎరువుల దుకాణాల్లో మదనపల్లి ఏడీఏ శివశంకర్ తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీ చేసి, సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో నాణ్యతతో కూడిన ఎరువులతోపాటు ధరల పట్టికలు ఉంచాలన్నారు. మన గ్రోమోర్‌లో సైతం ఎమ్మార్పీకి అమ్ముతున్నారా లేదా, ఎరువులు నాణ్యతగా ఉన్నాయా లేదా, ఐఎస్ఐ మార్క్ ఉన్న వాటిని విక్రయిస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఎరువుల దుకాణాల్లో లైసెన్సులు, అనుమతులన్నీ సక్రమంగా ఉండాలని, లేనిపక్షంలో దుకాణాలను సీజ్ చేస్తామన్నారు. అలాగే ఎరువుల కొనుగోలు కోసం వచ్చిన రైతులతో మాట్లాడి, ధరలు, నాణ్యతపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఏవో హేమలత, వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

జీడీఎస్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పెద్దతిప్పసముద్రం : తపాలా శాఖలో ఖాళీగా ఉన్న గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) పోస్టులకు ఆసక్తి గల నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చని పెద్దతిప్పసముద్రం సబ్ పోస్ట్ మాస్టర్ ఆర్.రెడ్డిశేఖర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 116 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 18–40 ఏళ్ల మధ్య వయస్సు కలిగి 10వ తరగతిలో అత్యధిక మార్కులు కలిగి ఉన్నవారు ఈ నెల 16 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎలాంటి రాత పరీక్షలు, ఇంటర్వ్యూలు ఉండవని కేవలం మెరిట్ మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. మండల పరిధిలో ఒక పోస్ట్‌మ్యాన్ పోస్టు కూడా ఖాళీగా ఉందన్నారు. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన వివరించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

పెద్దమండ్యం : పక్కా గృహాల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీడీవో శ్రీధర్‌రావు అన్నారు. తన కార్యాలయంలో గురువారం పక్కా గృహాల నిర్మాణాలపై ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాలలో గృహ నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. మోల్డింగ్ వరకు పూర్తి చేసిన పక్కాగృహాలను వెంటనే పూర్తి చేయించాలన్నారు. లబ్ధిదారులకు రీచ్ ద్వారా ఇసుకను సకాలంలో అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు జగన్, ఖాదర్‌బాషా, శైలజ, ఇన్‌చార్జి ఏఈ సందీప్ పాల్గొన్నారు.